# 2

# కళ్ళు.

**నా** కళ్ళు అందమైనవి అంటుంది అమ్మ. కళ్ళ నిండుగా కాటుక పెడుతుంది. 'పచ్చటి చెంపల మీదుగా నల్లటి కాటుకా, తెల్లని కళ్ళలో నల్లని కాటుకా ఎంత కళ వుందే నీ కళ్ళలో' అంటుంది వదిన కూడా.

నిజమే నా కళ్ళు పెద్దవే – కాని ఏం లాభం. వాళ్ళ రాముడివి చింతాకంతకళ్ళు. చీకిరి కళ్ళు. నాకూ పదేళ్ళే. వాడికీ పదేళ్ళే. ఇంకా పదిరోజులు వాడికంటే నేనే పెద్దదాన్ని. కానీ, మా ఊళ్ళో వాడు చూసిన వింతల్లో వందోవంతు కూడా నేను చూడలేదు. మొన్నొకరోజు మా వాకిట్లో పెద్ద గొడవ అయింది. నేను బయటకు పరుగెత్తి గుంపులో నుంచున్నా. ఎక్కడ్నించి వచ్చాడో ఏమో మా అన్నయ్య బరబరా లాక్కొచ్చి ఇంట్లో పడేశాడు.

"ఆడపిల్లవు భయం లేకుండా ఎట్లా నుంచున్నావే – ఆ అరుపులు ఇంట్లో వుండి వింటుంటేనే గుండె దడదడ లాడుతుంటేనూ" అంది అమ్మ.

"నాకు భయంవెయ్యలేదు" అని చెబితే అందరూ తిట్టిపోశారు. మా వదిన పిరికితనం చూస్తే మా అన్నయ్యకి ఎంత సంతోషమో. ఒదిన్ని భయపెట్టి ఆమె దడుచుకుంటే కిలకిలా నవ్వుతాడు. ఒదిన కూడా అంతే – మాట్లాడితే "అమ్మో భయం" అని కళ్ళు మూసుకుంటుంది. "కళ్ళు తెరిచి చూడు ఒదినా ఏం లేదంటే" తెరవదే. ఒదిన కళ్ళు కూడా పెద్దవే కానీ ఏం లాభం వదినకు ఆ కళ్ళు మూసుకుని వుండటమే బాగుంటుంది.

వీధిలోకి ఒస్తారా – అమ్మా ఒదినా ఇక తలెత్తరు. వాళ్ళ కళ్ళన్నీ నేలమీదనే. నేలమీద ఏముంటాయి, ఒక వేళ ఏమన్నా వున్నా ఎన్ని రోజులు అవే చూస్తాం? వీధిలో ఏమున్నాయో సరిగ్గా చూడనే చూడరు. పైగా అమ్మ నన్ను తిడుతుంది.

'అలా దిక్కులు చూస్తావేం' అని, 'తలొంచుకు నడువు. నేల మీద చూడు' అంటూ మొట్టికాయలు వేస్తుంది.

అమ్మో – నేనసలు అట్లా నడవను. వీధిలోకి ఒచ్చినపుడు అటూ ఇటూ చూడకపోతే అన్నీ నాకెట్లా తెలుస్తాయి. ఇరవై నాలుగ్గంటలూ వీధిలో తిరిగే రాముడు నన్నసలు లెక్క చేస్తాడా.

కానీ వాడికి కూడా చాలా తెలియవు. ఆడవాళ్ళు కొన్నిటిని మాత్రమే చూస్తేచాలని వాడికి తెలియదు. అమ్మకు అవన్నీ బాగా తెలుసు.

మన ఒంటిని కూడా మనం సరిగా చూసుకోగూడదు. అమ్మకేకలేస్తుంది. ఏంటా చూడటం అని, పెద్దవుతున్న కొద్దీ మగవాళ్ళని అసలు సరిగ్గా చూడకూడదు. ఇప్పుడు నేను రాముడితో ఆడుకుంటున్నానా ఇంకో రెండేళ్ళు పోతే రాముడితో ఆడుకోగూడదు. రాముడు కనపడ్డగానే ఇంట్లోకి వెళ్ళాలి. బజార్లో కనపడితే తల పైకెత్తకుండా కళ్ళు మాత్రం పైకెత్తి చూడాలి. మా పక్కింట్లో వుండే పద్మక్క అట్లాగే చూస్తుంది. ఎందుకక్కా అట్లా చూస్తావూ అంటే అలా చూస్తేనే భలే అందంగా వుంటుందట. నా కింకా చేతకావటంలా అట్లా చూడటం. ఎప్పటికొస్తుందో ఏమో – రాముడికైతే చచ్చినారాదు.

ఆడవాళ్ళ కళ్ళ వెంట నీళ్ళు తొందరగా రావాలిట. మొన్న అమ్మ పక్కింటామెను తిడుతోంది. "రాతిగుండె, కంటెమ్మట చుక్క నీళ్ళు రాలేదు" అని. ఆడవాళ్ళకి ఊరి కూరికినే ఏడుపు రావాలిట. నాకెందుకో కోపం వస్తుంది గానీ ఏడుపురాదు. నన్ను ఊరికే తిడితే నాకు కోపం వస్తుంది. ఒదినకైతే ఏడుపొస్తుంది. అప్పుడన్నయ్య కోపం తగ్గుతుంది.

'చాల్లే ఇక ఆ ఏడుపు ఆపు' అంటాడు. ఐనా సరే ఒదిన కుమిలి కుమిలి ఏడుస్తుంది. అన్నాయ్యా ఒదినా పోట్లాడుకుంటే ఎప్పుడూ ఒదినే ఏడుస్తుంది. అన్నయ్య ఒక్కసారీ ఏడవడే. అమ్మా నాన్నా అయినా అంతే – ఎప్పుడూ అమ్మే ఏడవాలి. నాకు ఏడుపంటే ఇష్టంలేదు. ఏడిస్తే నా కళ్ళు ఏమీ బాగుండవు. మొహమంతా నల్లగా కాటుకవుతుంది. నేనెప్పుడూ ఏడవను బాబూ.

మనకళ్ళకి ఏం కనపడ్డా సరే మనం ఏం అనకూడదంట – ఏం చెయ్యకూడదంట. నాకు నాన్న చేతిలో మామిడిపళ్ళ బుట్ట కనపడిందనుకో – 'ఓ మామిడిపళ్ళో' అని ఎగర బుద్ధేస్తుంది. ఎగర కూడదంట. ఆ మామిడిపండు మన కంచంలోకి వచ్చేవరకూ

అరవకూడదంట. మన కంచంలోకి వచ్చాక బుద్ధిగా తినాలంట. మామిడి పళ్ళు చూడగానే ఎగరకపోతే చూసిన ఫలితం ఏముంది?

అలాగే కోపం వచ్చేవి చూసినా అరవకూడదంట. అప్పుడొక రోజు ఏమయిందీ, కల్యాణి అక్క కాలేజీ నుంచి ఒస్తుంటే ఒకబ్బాయి సైకిల్ మీద నుంచి పడిపోయాడు గదా – కాలు బెణికి లేవలేక పోయాడు. రోడ్డుమీదేమో ఎవరూ లేరు. కల్యాణి అక్క అతన్ని లేపి సైకిల్‌ని లేపి స్తంభానికి ఆనించి పెట్టింది. ఆ అబ్బాయి కాలు విదిలించు కుంటుంటే అతను పడకుండా పట్టుకుందట. ఇదంతా మా ఎదురింటి మామయ్య చూసి కల్యాణి వాళ్ళ నాన్నతో చెప్పాడట. కల్యాణి అక్కని బాగా కొట్టాడు. పరాయి మగాడిని రోడ్డుమీద కావలించుకుంటావా – అని తిడుతూ కొట్టాడు. పడిపోతే చూసి లేవదీశానంటే – చూస్తే చూశావు నీ దారిన నువ్వు రావాలి గాని దేశసేవ చేస్తావా అంటూ తిట్టాడు. కల్యాణి వాళ్ళ నాన్న కూడా మామయ్యే కాని అక్కను అట్లా కొట్టాక నాకు కోపం వచ్చి మామయ్యతో పలకటం మానేశా. చూసిన తర్వాత ఏదన్నా చెయ్యాలి గదా – లేకపోతే చూడటం ఎందుకు? చూడక ముందూ చూసిన తర్వాతా ఒకే రకంగా వుంటే చూడటం ఎందుకు? అంటే అమ్మకు అర్థం కాదు. నోర్మూసుకో అంటుంది.

కళ్ళు మూసుకోవాలి. నోరు మూసుకోవాలి. మా అన్నయ్య ఆఫీసులో పని చేసే ఆవిడొచ్చిందా – ఆవిడెంత బాగా నవ్వుతుందో. కాని చిత్రం ఆవిడ బొట్టు పెట్టుకోలేదు. కాటుక పెట్టుకోలేదు. ఐనా సరే ఎంత బాగుందో. ఉన్నంత సేపు చక్కగా నవ్వుతూ ఉంది. ఆవిడ అమ్మకీ ఒదినకూ నచ్చలేదుట. ముఖాన బొట్టు లేకపోతే మెళ్ళో గొలుసు లేకపోతే ఆ ముఖమే రోతగా ఉంటుందట. 'నిజంగా బాగోలేదామ్మా, నిజంగా బాగోలేదామ్మా' అని ఎన్నిసార్లో అడిగాను. 'నా కళ్ళకు పరమరోతగా కన్పించిందే – బొట్టులేని ముఖం చూడబుద్ధవదు నాకు' అంది అమ్మ. అమ్మంత అయితే నా కళ్ళు కూడా అమ్మ కళ్ళలాగే మారిపోతాయా.

అమ్మో – అలా మారిపోతే నా కళ్ళకు ఏమీ కనపడవు.

'ఎక్కడెక్కడివన్నీ నీ కళ్ళకే కనిపిస్తాయేమిటే' అంటుంది అమ్మ. అమ్మ కళ్ళకు ఏమీ కనిపించవు. కనిపించిన వాటి గురించి అమ్మ పట్టించుకోదు. ఆడవాళ్ళ కళ్ళు ఇట్లా ఎందుకుంటాయో –

*13 సెప్టెంబర్ 1988*

*స్త్రీ శక్తి (ఆంధ్రజ్యోతి)*